పట్టించుకోరు.. పర్యవేక్షించరు

నిలిచిన కేజీబీవీ భవన నిర్మాణం
- నిర్మాణానికి రూ.3.20 కోట్లు కేటాయింపు
- బిల్లులు మంజూరుకాక పనులు నిలిపివేత
- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల వినతి


అక్కన్నపేటలో అసంపూర్తిగా కేజీబీవీ భవన నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.20 కోట్లు కేటాయించింది. పనులకు 2021లో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. రెండు అంతస్తుల వరకు పనులు అంతరాయం లేకుండా జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. చేసిన పనులకు సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇక పారుగు మండలంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీలో సరైన సౌకర్యాలు లేకపోయినా నెట్టుకొస్తున్నామంటూ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదుల్లో వర్షపు నీరు నిలిచి తమ పిల్లలు ఇబ్బంది పడ్డారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తాత్కాలిక భవనంలో ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల

ఇటీవల అక్కన్నపేట మండలానికి ఎస్టీ బాలికల రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయం మంజూరైన విషయం తెలిసింది. ఈ క్రమంలో తక్షణమే తాత్కాలిక భవనంలో ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పలు భవనాలను పరిశీలిస్తున్నారు. అయితే నిర్మాణంలో ఉన్న కేజీబీవీ భవనం శరవేగంగా పూర్తి చేస్తే ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీ ఖాళీ అవుతుందని, వాటి స్థానంలో ఎస్టీ బాలికల గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయం ఏర్పాటు చేయొచ్చనే ఆలోచనలో ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలిసింది. మూడు నెలల వ్యవధిలో అక్కన్నపేట మండలంలో తాత్కాలిక భవనంలో ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రారంభం కానున్నట్లు చెబుతున్నారు.

> **త్వరగా పూర్తిచేయాలని కోరాం**
>
> కేజీబీవీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని చెప్పాము. రెండు నెలల్లో పూర్తిచేస్తానని సదరు కాంట్రాక్టర్ తెలిపాడు. కొన్నేళ్లుగా కేజీబీవీని అద్దె భవనంలో కొనసాగిస్తున్నాము. భవనం పూర్తయితే మిగిలిన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.
>
> – నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ, అక్కన్నపేట మండలం

కాంగ్రెస్ విచ్ఛిన్నానికి కుట్ర

పార్టీ మండలాల అధ్యక్షులు

గజ్వేల్‌రూరల్: సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన చరిత్ర నర్సారెడ్డిదని, కోవర్టు రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో గల ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నర్సారెడ్డిని కోవర్టు అంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజ్ఞాపూర్‌లో జరిగిన దాడి ఘటనకు నర్సారెడ్డికి సంబంధం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకే బండారు శ్రీకాంత్‌రావు, జశ్వంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. గజ్వేల్ కాంగ్రెస్‌లో నర్సారెడ్డి బలమైన నాయకుడని, వచ్చే ఎన్నికల్లో టికెట్ కోసమే వారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి బీఆర్‌ఎస్ నాయకులే కొంతమంది కాంగ్రెస్ నాయకులతో కోవర్టు రాజకీయాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండల పార్టీల అధ్యక్షులు మల్లారెడ్డి, విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, సందీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగారావు, కనకయ్యగౌడ్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఎంపీటీసీలు పావనిరెడ్డి, మంజుల, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముట్రాజ్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన


పందిల్లలో పర్యటిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌమ్య

హుస్నాబాద్‌రూరల్: సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌమ్య వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పందిల్ల గ్రామంలో వారి పనితీరును పరిశీలించారు. సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు రోగాల బారినపడకుండా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఆమె వెంట మండల వైద్యురాలు డాక్టర్ నికిత, సర్పంచ్ తోడేటి రమేశ్ తదితరులు ఉన్నారు.


మహనీయుల చరిత్రను తెలియజేద్దాం


సమావేశానికి హాజరైన నాయకులు

గజ్వేల్‌రూరల్: బీసీ కులాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేసిన మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేద్దామని బహుజన సమాజ్ పార్టీ నాయకులు పిలుపు ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ 105వ జయంతి ఉత్సవాలను గజ్వేల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జులు వినోద్‌చారి, నరేష్, ప్రధాన కార్యదర్శి రమణాకర్ మాట్లాడారు. బీసీ కులాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో బీపీ మండల్ పోరాడి సాధించారన్నారు. వెనుకబడిన తరగతుల ఉన్నతి కోసం ఉద్యమించిన మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

సిద్దిపేట అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరీ


మాట్లాడుతున్న ఏడీఎం మహేశ్వరీ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రామునిపట్లలో ఆర్టీసీ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాలకు, విహారయాత్రలకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. సరుకు రవాణాకు కార్గో సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ కల్పిస్తున్న టీ9, టీ30 టికెట్స్, దివ్యాంగులు, విద్యార్థులకు తదితర వర్గాలకు కల్పిస్తున్న రాయితీలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, బస్‌పాస్ ఇన్‌చార్జి బాలకిషన్, వీబీఓ రవికుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై ఆగ్రహం


గుడికందుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్లు నరికిన దృశ్యం

తొగుట(దుబ్బాక): తొగుట మండలం గుడికందుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్లను శుక్రవారం నరికివేశారు. చెట్లు నరికి వేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏటా హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటుతోందన్నారు. నీడనిస్తున్న చెట్లను నరకడం దుర్మార్గమన్నారు. చెట్లను తొలగించేందుకు అనుమతిచ్చిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డిని వివరణ కోరగా చెట్ల కొమ్మలు భారీగా విస్తరించి ఇబ్బందికరంగా మారిందని, చెట్లు కోతులకు ఆవాసం మారాయని, తరచూ విద్యార్థులపై దాడిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్న అవి నానా హంగామా చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ, విద్యాకమిటీల తీర్మానం మేరకు చెట్లు తొలగించారని వివరించారు.

ఉనికి కోసం కాంగ్రెస్.. మతంపేరిట బీజేపీ

ఎమ్మెల్యే సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): అణచివేతకు, వెనుకబాటుకు గురైన గిరిజనులు ఆత్మ గౌరవంతో బతికేలా చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉనికి కోసం కాంగెస్.. మతంపేరిట బీజేపీ చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. బీజేపీ దుర్మార్గాలను ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇంట్లో సంక్షేమం, ఇంటి ముంగిట అభివృద్ధి ఇదే బీఆర్‌ఎస్ ప్రగతికి చిహ్నమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్లు లింగాల సాయిన్న, అశోక్‌బాబు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ముంగిట వైద్యసేవలు


దాచారంలో మాట్లాడుతున్న వినోద్ బాబ్జి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల ముంగిట లభిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బెజ్జంకి వైద్యాధికారి డాక్టర్ వినోద్‌బాబ్జి సూచించారు. మండలంలోని దాచారంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తోటపల్లి వైద్యాధికారి కృష్ణచైతన్య, దాచారం వెల్‌నెస్ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేశ్, సూపర్‌వైజర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ హక్కుల సాధనకు పోరాటం

చిన్నకోడూరు(సిద్దిపేట): ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిన్నకోడూరు గ్రామానికి చెందిన జంగిటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం ముదిరాజులను ఏకం చేస్తూ పోరాడుతానన్నారు. ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ) లోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దేవాలయాలతో గ్రామాలు సుభిక్షం


దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలో జాలిమైసమ్మ తల్లి దేవాలయం, బొడ్రాయి నిర్మాణానికి శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో జాలి మైసమ్మ తల్లి దేవాలయం, బొడ్రాయిని తొలగించారన్నారు. వాటి నిర్మాణాల కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. దేవాలయాల నిర్మాణాలతో గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురిరెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్, మాజీ ఎంపీపీ బొడ్డుల కనకయ్య, నాయకులు రామకృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, రేపాక స్వామి, నల్ల యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను మానిటర్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని బ్యాంక్, ఫైనాన్స్ కంపెనీ మేనేజర్లతో శుక్రవారం సీఐ కిరణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల, కంపెనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిత్యం మానిటర్ చేయాలన్నారు. సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైన సంఘటన జరిగిన వెంటనే అలారం పనిచేసేలా ఉండాలన్నారు. కేసుల విచారణలో అధికారులు సహకరించాలన్నారు. బ్యాంక్‌ల్లో పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్సైలు మహేష్, వివేక్, తిరుపతి, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి సర్వే బృందాలు


సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుస్నాబాద్: గృహలక్ష్మి లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ పథకానికి పట్టణంలో 1,040 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సూచించిన 23 అంశాలను పరిగణనలోకి తీసుకొని వారిని గుర్తించనున్నారు. ముగ్గురు సభ్యులతోకూడిన ఎనిమిది బృందాలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈనెల 16వ తేదీలోగా అర్హులను గుర్తించి ఉన్నతాధికారులకు పంపించాలని కలెక్టర్ ఆదేశించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. సర్వే బృందాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీటీ రోడ్లుగా ప్రధాన రహదారులు


బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో రోడ్లను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. శుక్రవారం మున్సిపాల్టి పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డులో మెయిన్‌రోడ్డు కమాన్ నుంచి సోమేశ్వర కట్ట వరకు రూ.కోటి వ్యయంతో తలపెట్టిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. మున్సిపాల్టీలోని మెయిన్‌రోడ్లను బీటీరోడ్లుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గోనెపల్లి సంజీవరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ వంగ బాల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అపరిశుభ్రంగా ఉంటే స్వాధీనం చేసుకుంటాం

కమిషనర్ రాజేంద్రకుమార్


హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఇళ్ల మధ్య స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలో అపరిశుభ్రంగాఉన్న ఖాళీస్థలం వద్ద హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేయించి మాట్లాడారు. ఖాళీ ప్లాట్లలో చెత్త, వర్షపు నీరు నిల్వ ఉండకుండా, పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాన్నారు. స్థలాలు అపరిశుభ్రంగా, ప్రజలకు అసౌకర్యంగా ఉన్నా, అనారోగ్య వాతావరణం ఉన్నా వాటిని స్వాధీనం చేసుకొని కమ్యూనిటీ పార్క్‌గా అభివృద్ధి చేస్తామని హెచ్చరించారు. ప్లాట్ యజమానికి భారీ జరిమాన విధిస్తామన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే కోర్టు మంజూరు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలకు కోర్టు మంజూరు కావడంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కృషి ఎంతో ఉందని, కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి అన్నారు. శుక్రవారం వారు మట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఆయన ప్రత్యేక చొరవతోనే పలు అభివృద్ధి పనులకు రూ.72 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆరోపణలను ప్రజలు నమ్మొద్దని, వాటిని బీఆర్‌ఎస్ పార్టీ తరుపున ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మోసిన్, పట్టణ యూత్ అధ్యక్షుడు యాట భిక్షపతి ఉన్నారు.

రుణమాఫీ చేయాలి

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎనగుర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చేయడం లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌నర్సుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


మానవహారం నిర్మించిన సెకండ్ ఏఎన్‌ఎంలు

సిద్దిపేటకమాన్: వీఆర్‌ఏలు, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంలను కూడా రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం మానవహారం నిర్మించారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నినాదాలు చేశారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సిద్దిపేటకమాన్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలంగాణ జాగృతి సిద్దిపేట జిల్లా యూత్ కన్వీనర్ గ్యాదరి గిరి హెచ్చరించారు. ఎమ్మెల్సీపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. మహిళ పట్ల ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 5వ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సిద్దిపేటలో సెప్టెంబర్ 4, 5వ తేదీల్లో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాను, హరీశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి



కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డు మధ్యలో ఉన్న కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి లోకేష్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ బీఎస్‌ఆర్‌కేఎస్ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈనెల 17వ తేదీన జనగామలో జరిగే బీఎస్‌ఆర్‌కేఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్ర బిక్షపతి పిలుపు ఇచ్చారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణరంగ కార్మిక సంఘం ఆవిర్భావించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ సభను జనగామలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

◆ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ ఆదేశించారు. శుక్రవారం ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ముట్రాజ్‌పల్లిలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించారు.



◆ దాతలు సహకరించాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాత సహకరిస్తే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలను కల్పించవచ్చని ఇన్‌చార్జి ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. శుక్రవారం పందిల్ల పాఠశాల విద్యార్థులకు దాతలు అందించిన టై బెల్టు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను మనఊరు బడికి పంపితే వారికి కావల్సిన పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బండారి మనీల, సర్పంచ్ తోడేటి రమేశ్, ఎంపీటీసీ బానల విజయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచరు శారద తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డుకు మరమ్మతులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తీగలకుంటపల్లి- సోమరంపల్లి రోడ్డును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి సొంత డబ్బుతో మరమ్మతులు చేయించారు. గతంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తారు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారని విమర్శించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మరమ్మతులు చేయించానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, రాగుల సంపత్ పాల్గొన్నారు.